
సాక్షి
అనంతపురం
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ. 31 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్టంగా రూ.31 వేలు, కనిష్టం రూ.15 వేలు పలికాయి.



టమాట కిలో రూ.9

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.9, కనిష్టం రూ.3, సరాసరి రూ.5.50 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
40.1°/21.9°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా ఉంది. గాలి వేగం తగ్గింది.



న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో తగ్గిన నీరు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)లో నీటి మట్టం తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం నాటికి 100.855 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గాను 8.070 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 19.170 టీఎంసీలు నిల్వ ఉండేవి. ప్రస్తుతం ఎండ తీవ్రత వల్ల నీరు ఆవిరవుతోంది. డ్యాంలోని నీరు డెడ్ స్టోరేజ్‌కు పడిపోతుండడంతో బోర్డు అధికారులు తాగునీటికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో జీరోకు పడిపోయింది. అవుట్‌ఫ్లో మాత్రం 5,818 క్యూసెక్కులు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

సరిహద్దులో ప్రత్యేక నిఘా



చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

విడపనకల్లు: హావళిగి గ్రామంలో రెండు రోజుల కిందట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆంధ్ర – కర్ణాటక చెక్ పోస్టును ఎస్పీ ఫక్కీరప్ప శుక్రవారం తనిఖీ చేశారు. కర్ణాటకలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హావళిగి కర్ణాటక సరిహద్దు అయిన రూపనగుడి గ్రామాల మధ్య ప్రత్యేకంగా చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల వేళ ప్రత్యేక నిఘా ఉంచాలని గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రామచంద్రయ్యను ఆదేశించారు. ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని సూచించారు. మద్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.

3న పెన్షన్ కానుక



అనంతపురం: వైఎస్సార్ పెన్షన్ కానుక ఈ నెల మూడో తేదీన అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఏప్రిల్ 1న బ్యాంకులకు సెలవు, రెండో తేదీ ఆదివారం కావడంతో దేశ వ్యాప్తంగా బ్యాంకులకు సెలవు కావడంతో మూడో తేదీన ఉదయమే పెన్షన్ల పంపిణీ ఉంటుందన్నారు.

తలుపు తట్టిన ఆనందం

మాట ఇస్తే వెనక్కు తగ్గేది లేదు.. హామీ ఇచ్చాడంటే నెరవేర్చి తీరతాడు...ఇదీ జగన్‌మోహన్‌రెడ్డిపై జనానికున్న నమ్మకం. ఇచ్చిన మాట మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షలాదిమందికి వైఎస్సార్ పెన్షన్ కానుక ఇచ్చారు. ఏడాదికోసారి పెన్షన్ మొత్తం పెంచుతున్నారు. ప్రతినెలా ఒకటో తేదీ ఇంటివద్దకే వలంటీర్లు నగదు తీసుకువచ్చి ఇస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారు ఇలా ఒకరేమిటి లక్షలాదిమందికి పెన్షన్ కానుక భరోసా ఇచ్చింది. వృద్ధులైన తల్లిదండ్రులకు అన్నం పెట్టకుండా కొంతమంది సంతానం నిర్లక్ష్యం చేస్తే.. జగన్ ఇస్తున్న పెన్షనే వారికి జీవనాధారం అయ్యింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకు రూ.140 కోట్ల మేర పెన్షన్ కానుక కోసం ఖర్చు చేస్తున్నారు.

- 'వైఎస్సార్ పెన్షన్ కానుక'తో అభాగ్యుల జీవితాలకు భరోసా
- ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే పింఛన్లకు భారీగా వ్యయం
- నెలకు రూ.140 కోట్ల లెక్కన ఖర్చు చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5.41 లక్షల మందికి లబ్ధి
- లబ్ధిదారుల జీవన ప్రమాణాలపై సానుకూల ప్రభావం చూపించిన పెన్షన్ కానుక



సాక్షి ప్రతినిధి, అనంతపురం: లక్షలాది కుటుంబాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక అసాధారణ సానుకూల మార్పులను తీసుకొచ్చింది. వృద్ధాప్యంలో కుటుంబానికి భారంగా కాకుండా ఈ పెన్షన్ ఊరటనిస్తోంది. మేము మీకు భారం కాదు.. మా బిడ్డ మాకు నెలనెలా వేతనం ఇస్తున్నారు.. ఈ డబ్బుతో మేము బతుకుతున్నాం.. అన్న భరోసా చాలామంది వృద్ధుల్లో కనిపిస్తోంది. చాలామంది భర్తను కోల్పోయిన వాళ్లు, మంచానికే పరిమితమైన వాళ్లు కూడా పెన్షన్ కానుకతో మెరుగైన జీవితం గడుపుతున్నారు. ఒక్క ఏడాదిలోనే శ్రీసత్యసాయి జిల్లాలో రూ.823.41 కోట్లు, అనంతపురం జిల్లాలో రూ.857.963 కోట్లు వ్యయం చేశారంటే ఏ స్థాయిలో పెన్షన్ కానుక ఆదుకుందో అంచనా వేయొచ్చు. ఇటీవలే ముఖ్యమంత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ 2024 జనవరిలో పెన్షన్ కానుక కింద ఇచ్చే మొత్తాన్ని పెంచి ఎన్నికలకు వెళతామని చెప్పడంతో వారిలో మరింత భరోసా వచ్చింది.

పెన్షన్‌తోనే జీవనం



ప్రభుత్వం ప్రతి నెలా అందించే వితంతువు పెన్షన్‌తోనే జీవనం సాగిస్తున్నాను. భర్తను కోల్పోయిన నాకు అదే ఆదరువైంది. ఒకటోతేదీ తెల్లారకముందే వలంటర్ తలుపు తట్టి రూ.2,750 చేతిలో పెట్టేస్తారు. ఈ సహాయం నాలాంటి వారికి ఎంతో ప్రయోజనకరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.
– షహనాబాను, వితంతువు, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

పింఛనుతోనే బతుకుతున్నా..



నాకు ఇద్దరు కూతుళ్లు. వాళ్లకు పెళ్లి చేసి పంపించాను. కొడుకు చనిపోయాడు. నా భర్త పెన్నప్ప కూడా చనిపోయినాడు. ఒక్కదాన్నే ఉంటున్నాను. నాకు జగన్ బాబు నెల నెలా ఇచ్చే వృద్ధాప్య పింఛను రూ.2,750తోనే బతుకు వెళ్లదీస్తున్నా. ఎవరూ లేని వారికి జగన్ బాబే దిక్కు.
– వన్నూరమ్మ, హులికల్లు, కళ్యాణదుర్గం మండలం

అనంతపురం జిల్లాలో పెన్షన్ కానుక..

నెల	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
2022 ఏప్రిల్	2,63,287	68.050
2022 మే	2,55,631	65.610
2022 జూన్	2,55,025	65.460
2022 జులై	2,65,708	68.260
2022 ఆగస్టు	2,72,474	70.460
2022 సెప్టెంబర్	2,71,729	70.270
2022 అక్టోబర్	2,70,705	70.020
2022 నవంబర్	2,69,952	69.830
2022 డిసెంబర్	2,79,309	77.970
2023 జనవరి	2,77,367	77.447
2023 ఫిబ్రవరి	2,76,640	77.283
2023 మార్చి	2,76,640	77.283

శ్రీసత్యసాయి జిల్లాలో పెన్షన్ కానుక..

నెల	లబ్ధిదారులు	వ్యయం (రూ.కోట్లలో)
2022 ఏప్రిల్	2,53,468	64.97
2022 మే	2,53,346	64.90
2022 జూన్	2,52,162	64.59
2022 జులై	2,61,638	67.06
2022 ఆగస్టు	2,61,376	67.01
2022 సెప్టెంబర్	2,60,495	66.79
2022 అక్టోబర్	2,59,656	66.58
2022 నవంబర్	2,58,790	66.36
2022 డిసెంబర్	2,67,156	74.09
2023 జనవరి	2,66,045	73.82
2023 ఫిబ్రవరి	2,65,194	73.62
2023 మార్చి	2,65,194	73.62

పింఛనే నాకు ఆధారం



జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వికలాంగ పింఛన్ రూ.3వేలు అందుతోంది. మందులు, ఇతర అవసరాలకు ఈ డబ్బు వాడుకుంటున్నా. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందజేసి వెళ్తున్నాడు. సంతోషంగా జీవిస్తున్నాను. పెన్షన్ కానుక అభాగ్యులకు ఎంతోమేలు చేకూరుస్తోంది.
– అహమ్మద్, పెదపల్లి

గౌరవంగా బతుకుతున్నాం



ప్రతినెలా ఒకటో తేదీనే ప్రభుత్వం రూ.2750 ఠంచన్‌గా అందజేస్తుండడంతో గ్రామంలో గౌరవంగా బతుకుతున్నాము. పొదుపు సంఘంలో కంతులు చెల్లించడం, నిత్యావసరాలకు వినియోగించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ అందించే ప్రభుత్వాన్ని తాను ఎప్పుడూ చూడలేదు. సీఎంగా వైఎస్ జగన్ కలకాలం ఉంటే తమ లాంటి వారికి ఎలాంటి లోటు ఉండదు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణం చేస్తారనేది ముమ్మాటికీ నిజం అవుతుంది.
– నాగలక్ష్మి, వెంగళమ్మచెరువు

చాలా సంతోషంగా ఉంది



నా భర్త చనిపోయాడు. ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో వైఎస్సార్ పింఛన్ కానుకతో జగన్ ప్రభుత్వం ఆదుకుంది. సిఫార్సు లేకుండానే వలంటీర్ సహకారంతో పింఛన్ మంజూరు చేశారు. చాలా సంతోషంగా ఉంది. ఒకటో తేదీనే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్నారు.
– సావిత్రమ్మ, గోకులం, పుట్టపర్తి

ఎప్పటికప్పుడు అర్హుల గుర్తింపు



ఈ నెలలో అర్హులను గుర్తించి వదిలేయడం కాదు. ప్రతి నెలా అర్హులను గుర్తించి సంతృప్తస్థాయిలో వారికి పెన్షన్ అందిస్తున్నాం. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ కానుక అందాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు కొత్త లబ్ధిదారులను గుర్తిస్తూనే ఉన్నాం. వారికి నెల నెలా ఒకటో తేదీన పెన్షన్ ఇస్తున్నాం.
– నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ, అనంతపురం

ఏ మొహం పెట్టుకుని వచ్చారు?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా నరసింహయ్య

- నారా లోకేష్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: హామీలు ఇచ్చి నెరవేర్చకుండా మోసం చేసే నైజం టీడీపీ వారిదని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇంటింటికీ ఉద్యోగాలు ఇస్తామని యువతను, డ్వాక్రా రుణాలు, బంగారు రుణాలు మాఫీ చేస్తామని అక్కచెల్లెమ్మలను, వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తానని రైతులను మోసం చేసి.. మళ్లీ ఏ మొహం పెట్టుకుని టీడీపీ నేత నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారంటూ ప్రశ్నించారు. రాప్తాడు సమీపంలో జాకీ కంపెనీకి కేటాయించిన స్థలంలో రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాలకు సంబంధించి 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ 2016లో పరిశ్రమల శాఖ మంత్రిగా నారా లోకేష్ ఉన్నప్పుడు పరిటాల సునీత 'జాకీ' పరిశ్రమ కోసం రూ.140 కోట్లు విలువ చేసే 28 ఎకరాల భూమిని ఫేజ్ ఇండస్ట్రీకి రూ.3 కోట్లకే కట్టబెట్టారన్నారు. ఫేజ్ ఇండస్ట్రీ కంపెనీ చంద్రబాబు, లోకేష్‌కు బినామీ సంస్థ కనుకే చౌకగా భూమి కేటాయించారన్నారు. 2018 నాటికి ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి చేయలేదన్నారు. వారి చేతగానితనంతోనే జాకీ కంపెనీ ఏర్పాటు కాకుండా పోయిందన్నారు. ఈ విషయంపై ఆనాడే 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైందన్నారు. ఆనాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రులుగా నారా లోకేష్, పరిటాల సునీత ఉన్నారని గుర్తు చేశారు. వీరి ఆధీనంలోనే ఉన్న సదరు భూమిని తమకు అప్పగిస్తే ఉచితంగా ఫ్యాక్టరీ నిర్మించి, ఆరు వేలమంది మహిళలకు ఉపాధి కల్పిస్తామని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు.

పరిశ్రమలతోనే జిల్లా అభివృద్ధి

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పరిశ్రమల ద్వారానే జిల్లా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. ఈ దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు సత్వరం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సింగిల్‌విండో పోర్టల్ ద్వారా జనవరి, ఫిబ్రవరి నెలల్లో 110 దరఖాస్తులు వస్తే అందులో 93 ఆమోదించామన్నారు. నూతన పారిశ్రామిక విధానం 2023–27 గురించి కలెక్టర్, సభ్యులకు పరిశ్రమల శాఖ అధికారి నాగరాజరావు వివరించారు. విధి విధానాలను ప్రభుత్వం విడుదల చేసిన తరువాత అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

బడుగు వికాసం యూనిట్లకు సబ్సిడీ

వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం పథకం కింద 42 యూనిట్లకు రూ.651.63 లక్షల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. అదే విధంగా 2015–20 ఇండస్ట్రియల్ పాలసీ కింద ఆరు యూనిట్లకు రూ.6.40 లక్షలు, 2020–23 ఇండస్ట్రియల్ పాలసీ కింద ఐదు యూనిట్లకు రూ.10.22 లక్షలు మంజూరు చేసేందుకు ఆమోదించారు.

రెండు యూనిట్ల ఏర్పాటుకు ఎంఓయూ

రాష్ట్ర ప్రభుత్వం గత నెల 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో అనంతపురం జిల్లాలో రెండు యూనిట్ల ఏర్పాటుకు ఎంఓయూ చేసుకున్నాయని పరిశ్రమల శాఖ అధికారి నాగరాజరావు చెప్పారు. పోస్‌పోల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.275 కోట్లు పెట్టుబడితో 2,500 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో, ఎకో స్టీల్ ఇండియా రూ.554 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉపాధి కల్పన లక్ష్యంగా పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చాయన్నారు. పీఎంఈజీపీ కింద 2022–23 ఆర్థిక సంవత్సరంలో 770 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపించామని చెప్పారు. నిర్దేశించిన 284 యూనిట్లకు గానూ 175 యూనిట్లు రూ.664 లక్షల మార్జిన్ మనీతో గ్రౌండింగ్ అయ్యాయన్నారు. 51 యూనిట్లకు రూ.185 లక్షల మార్జిన్ మనీ మంజూరు వివిధ దశలో ఉన్నాయన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం నాగరాజారెడ్డి, డీసీఐఎఫ్ కేశవులు, ఎఫ్ఏపీసీసీఐ శేషాంజనేయులు, ఎఫ్ఏపీఏస్ఐఏ నాగరాజు, ఏపీఐఐసీ జెడ్ఎం మురళీమోహన్, ఏపీఎస్ఎఫ్‌సీ బీఎం ప్రకాశ్, రవాణా శాఖాధికారి సురేష్‌నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం కావాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, హౌసింగ్ డీఈలు, ఏఈలు, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ కేశవనాయుడు, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర పాల్గొన్నారు.

ఉచిత విద్య అమలు కావాలి

జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్‌-ఎయిడెంట్ పాఠశాలల్లో పేద పిల్లలకు ఒకటో తరగతిలో 25 శాతం కోటా అమలు కావాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఉచిత విద్యాహక్కు పోస్టర్లను కలెక్టర్ శుక్రవారం విడుదల చేశారు. ఉచిత విద్యాహక్కు కింద పాఠశాలల్లో ప్రవేశానికి ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ సాయిరాం తెలిపారు. డీఈఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

ఉపాధి కూలీలకు వేతనం పెంపు

- రోజుకూలి రూ.257 నుంచి రూ.272కు పెంపు
- నేటి నుంచి పెరిగిన వేతనం అమల్లోకి
- జిల్లాలో 4.77 లక్షల మంది కూలీలకు ప్రయోజనం



పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)


జిల్లాలో జాబ్‌కార్డులు
3,19,981

యాక్టివ్ జాబ్‌కార్డులు
2,63,252

నమోదైన కూలీల సంఖ్య
4,77,537


రాయదుర్గం: ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలకు వేతనం పెరిగింది. పెంచిన వేతనం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే అమలులోకి రానుంది. మొన్నటి వరకు కొలతల ప్రకారం రోజుకు రూ.257 చెల్లిస్తుండగా, దానికి అదనంగా రూ.15 పెంచి రూ.272 అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. జిల్లాలో 4,77,537 మంది కూలీలకు ప్రయోజనం కలగనుంది. పెంచిన కూలి రేట్లపై అధికారులు క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ (ఎన్ఎంఎంఎస్) విధానంతో ఇబ్బందులు ఎదురై ఉపాధి కూలీల సంఖ్య క్రమంగా తగ్గింది. కూలి చెల్లించేందు కోసం జాబ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసింది. కూలి అదనంగా రూ.15 చొప్పున పెంచడం, వ్యవసాయ పనులు కూడా ముగియడంతో మళ్లీ ఉపాధి కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

కష్టానికి ప్రతిఫలం



ఉపాధి కూలి ఇదివరకు రూ.257 వచ్చేది. దీనికి రూ.15 అదనంగా పెరిగింది. ఈ నెల నుంచి 100 రోజుల ఉపాధి ప్రణాళిక కూడా మొదలు కావడంతో సద్వినియోగం చేసుకుంటాం. కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తోంది. కూలి డబ్బులను ప్రభుత్వం సకాలంలో అందిస్తోంది.
– ధనలక్ష్మి, ఉపాధి కూలీ, కలుగోడు

కూలీల్లో సంతోషం



జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకీ ఉపాధి పనులు కల్పించేలా ప్రణాళిక చేపట్టాం. ఉన్న ఊర్లోనే రూ.272 కూలి అందించే ప్రక్రియకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. పెరిగిన వేతనంపై కూలీలు సంతోషంగా ఉన్నారు.
– వేణుగోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ, అనంతపురం

నిర్లక్ష్యం ఇ'లా' అయితే ఎలా?

- 2018 నుంచి వరుసగా మూడేళ్లు ఏపీ లాసెట్ నిర్వహణ
- లాసెట్ కన్వీనర్‌గా ఎస్కేయూ ప్రొఫెసర్ జ్యోతి విజయకుమార్
- 2018, 2019లో రూ.1.50 కోట్లు అడ్వాన్స్‌గా చెల్లింపు
- ఇప్పటిదాకా బిల్లులు సమర్పించని వైనం
- విచారణ కోసం ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కమిటీ



అనంతపురం: ఏపీ లాసెట్ నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పరువు ప్రతిష్టలకు మచ్చతెచ్చేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. లాసెట్ కన్వీనర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ జ్యోతి విజయ్‌కుమార్‌ను విచారణ చేసేందుకు ఉన్నత విద్యామండలి ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు గత వారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలోనే ఉన్నత విద్యామండలి అధికారులు స్పష్టం చేశారు. కమిటీలో సభ్యులుగా ఎవరిని నియామకం చేస్తారనే అంశంపై త్వరలోనే అధికారిక ఉత్తర్వులు రానున్నాయి. 2018, 2019, 2020 ఏపీ లాసెట్ బాధ్యతను ఎస్కేయూ నిర్వర్తించింది. 2018, 2019లో ఏపీ లాసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ జ్యోతి విజయకుమార్ వ్యవహరించారు. సెట్ నిర్వహణకు 2018లో రూ.85 లక్షలు, 2019లో రూ.65 లక్షలు మొత్తం రూ.1.50 కోట్లు అడ్వాన్స్ రూపంలో కన్వీనర్‌కు ఉన్నత విద్యామండలి చెల్లించింది. లాసెట్ నిర్వహణ, ప్రశ్నపత్రాల రూపకల్పన, ప్రింటింగ్, పరీక్ష కేంద్రాల నిర్వహణ, ఇన్విజిలేటర్ల రెమ్యునరేషన్‌కు చెల్లించిన బిల్లులను ఆడిటింగ్ చేసి ఉన్నత విద్యామండలికి అందజేయాలి. ఈ ప్రక్రియ అనంతరం ఏదైనా డబ్బు మిగిలితే ఆ సొమ్మును ఉన్నత విద్యామండలికి వెనక్కి చెల్లించాలి. అయితే ఇప్పటిదాకా బిల్లులు సమర్పించలేదు. ఇప్పటికే ప్రొఫెసర్ జ్యోతి విజయ్‌కుమార్‌కు మూడు దఫాలుగా వర్సిటీ అధికారులు మెమోలు జారీ చేశారు. అయినా బిల్లుల సమర్పణలో ప్రొఫెసర్ అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తుండడం పలు విమర్శలు దారితీస్తోంది. ఈ క్రమంలో ఉన్నత విద్యామండలి కమిటీ నేరుగా ప్రొఫెసర్ జ్యోతి విజయ్‌కుమార్‌ను విచారించి బిల్లులకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా నివేదికను ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు సమర్పించనుంది.

బీమా భారం తగ్గుతుంది

అనంతపురం అర్బన్: ప్రజా పంపిణీ వ్యవస్థలో కార్డుదారులకు బియ్యం సరఫరా చేస్తున్న ఎండీయూ వాహనాలకు త్వరలో బీమా ప్రీమియం భారం తగ్గనుందని జేసీ కేతన్‌గార్గ్ తెలిపారు. ఎండీయూ వాహనదారులతో జేసీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎండీయూ వాహనాలను కమర్షియల్ నుంచి మిస్‌లీనియస్ విభాగానికి మార్పు చేస్తారన్నారు. అలాగే వాహన మిత్ర పథకం ద్వారా రూ.10 వేలు వస్తుందన్నారు. ఈ మార్పు వల్ల బీమా భారం తగ్గుతుందన్నారు.

ఎవరూ 'కోర్'కోవడం లేదు!

- సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు వద్దంటున్న యాజమాన్యాలు
- ఏఐసీటీఈకి పెద్ద ఎత్తున విన్నపాలు



అనంతపురం: పురాతన బ్రాంచులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు ఇంజినీర్ అంటే సివిల్ ఇంజినీరే అనే భావన ఉండేది. తాజాగా ఇంజినీర్ అంటే సాఫ్ట్‌వేర్, ఐటీ ఇంజినీర్ అనే పరిస్థితికి వచ్చింది.

యాజమాన్యాల నిరాసక్తత

గతేడాది కోర్ బ్రాంచ్‌లు అయిన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో సీట్లను కాలేజీ యాజమాన్యాలు గణనీయంగా తగ్గించుకున్నాయి. తాజాగా అసలు కోర్ బ్రాంచ్‌ల ఊసే లేకుండా కేవలం కంప్యూటర్ సైన్సెస్, ఐటీ ఆధారిత కోర్సులే చాలని ఇంజినీరింగ్ యాజమాన్యాలు నిర్ధారించుకున్నాయి. ఈ మేరకు ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్)కు విన్నపాలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఇంజినీరింగ్ కళాశాలలు ఏఐసీటీఈ అనుమతికి సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 7 ను తుది గడువుగా నిర్దేశించింది. ఈ నేపథ్యంలో కొత్త బ్రాంచ్‌ల అంశం తెరమీదకు వచ్చింది.

ఒక్కో కళాశాలకు 360 సీట్లు

ఒక్కో ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని బ్రాంచులు కలిపి మొత్తం గరిష్టంగా 360 సీట్లు భర్తీ చేసుకోవడానికి ఏఐసీటీఈ అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది. కోర్ బ్రాంచ్‌ల్లో కేవలం సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఒకే సబ్జెక్టు పేరుతో బ్రాంచ్‌లు ఉంటే ఈ స్థానంలో అదనంగా ఐటీ ఆధారిత బ్రాంచ్‌లకు అనుమతి స్తామని ఏఐసీటీఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లో ఎలక్ట్రానిక్స్ వంటి రెండు రకాల సబ్జెక్టులు ఉండడంతో పూర్తి క్లారిఫికేషన్ నిమిత్తం ఏఐసీటీఈకి అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు లేఖ రాశాయి. ఒక వేళ కోర్ బ్రాంచ్‌లు తప్పనిసరి అయితే సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో కేవలం 30 సీట్లు చాలంటూ జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని 90 ఇంజినీరింగ్ కళాశాలల్లో 72 ఇంజినీరింగ్ కళాశాలలు దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఒక్కో కళాశాలకు గరిష్టంగా 360 సీట్లు కేటాయించారు. ఇందులో 90 సీట్లు కోర్ బ్రాంచ్‌లకు కేటాయిస్తే తక్కిన 270 సీట్లు కంప్యూటర్ సైన్సెస్, ఐటీ ఆధారిత బ్రాంచ్‌లకు సీట్లు దక్కేలా అనుమతి తీసుకుంటున్నారు. 30 సీట్ల కంటే ఎక్కువ భర్తీ కావనే ఉద్దేశంతో అఫ్లియేషన్ ఫీజు తగ్గించుకునేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి.

15 కళాశాలలకే అనుమతి

ఇంజినీరింగ్ కళాశాలలు తొలుత ఏఐసీటీఈకి దరఖాస్తు చేసుకుని ఎన్ని సీట్లు అవసరమో వాటికి అనుమతి తెచ్చుకుంటారు. అనంతరం వర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల హోదాకు దరఖాస్తు చేసుకుంటాయి. ఈ క్రమంలో ఏఐసీటీఈకి వెళ్లే ముందే ముందస్తుగా వర్సిటీ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. మొత్తం 90 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇప్పటిదాకా కేవలం 15 ఇంజినీరింగ్ కళాశాలలకు మాత్రమే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చారు. వర్సిటీకి చెల్లించాల్సిన యూసీఎస్ (యూనివర్సిటీ కామన్ సర్వీసెస్) ఫీజులు బకాయి పడడంతో ఏఐసీటీఈ దరఖాస్తులు వర్సిటీ ఆమోదించలేదు. వర్సిటీకి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించిన ఇంజినీరింగ్ కళాశాలలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. ఏఐసీఈటీ దరఖాస్తుకు ఏప్రిల్ 7 తేదీ లోపు దరఖాస్తు చేసుకుని కోర్ బ్రాంచ్‌ల్లో సీట్లు తగ్గించుకునే పనిలో కళాశాల యాజమాన్యాలు నిమగ్నమయ్యారు.

ఫీజులు చెల్లించాల్సిందే



యూసీఎస్ (యూనివర్సిటీ కామన్ సర్వీసెస్)బకాయిలు వర్సిటీకి పూర్తిగా చెల్లిస్తేనే అనుబంధ గుర్తింపు ఇస్తాం. ఈ అంశంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించాం. వర్సిటీ ప్రధాన ఆదాయ వనరు అయిన యూసీఎస్ ఫీజుల అంశంలో ఆదేశాలు పాటించాల్సిందే.

– జింకా రంగజనార్ధన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

క్లుప్తంగా

లారీని ఢీకొన్న ఆటో

- ఐదుగురు కూలీలకు తీవ్రగాయాలు



జాతీయ రహదారిపై లారీని వెనుక వైపు నుంచి ఢీకొన్న ఆటో

ఉరవకొండ: మండల పరిధిలోని చిన్నమూష్టూరు సమీపంలోని 42వ జాతీయ రహదారిపై ఆగి వున్న లారీని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఐదుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు... ఉరవకొండ పట్టణంలోని పాతపేటకు చెందిన 15 మంది కూలీలు శుక్రవారం ఆమిద్యాలలో మిర్చి పంట తొలగించేందుకు వెళ్లారు. తిరిగి వారంతా ఉరవకొండకు ఆటోలో బయలు దేరారు. అయితే లారీ .. ఆటోను ఓవర్‌టేక్ చేయబోయింది. లారీకి ఎదురుగా కారు రావడంతో లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఈ సమయంలోనే ఆటో వేగంగా వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో పాతపేటకు చెందిన నాగిరెడ్డి, ఎర్రమ్మ, వన్నూరప్ప, సుభాషిణి, పద్మావతిలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో ఉరవకొండ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను వసూలులో తాడిపత్రి టాప్

తాడిపత్రి టౌన్: 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూలులో తాడిపత్రి మున్సిపాలిటీ ముందంజలో నిలిచింది. తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుకు సంబంధించి రూ 7.82 కోట్లు ఉండగా శుక్రవారం రాత్రి 7–30 గంటల సమయంలో రూ 7.57 కోట్లు (96.80 శాతం) వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో 10వ స్థానంలో, రీజనల్, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31 లోపు ఒకేసారి బకాయి మొత్తం చెల్లించిన పన్ను బకాయిదారులకు వడ్డీ మాఫీ పథకాన్ని ప్రకటించిందన్నారు. ఈ పథకం కింద మున్సిపాలిటీ పరిధిలో 2,894 మంది పన్ను బకాయిదారులు రూ 1,54, 80,000 పన్ను చెల్లించి వడ్డీ మాఫీ పథకాన్ని వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.

నీట మునిగి బాలుడి మృతి



రాము (ఫైల్)

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని పులగుట్టపల్లి గ్రామానికి చెందిన కే.రాము (14) అనే బాలుడు శుక్రవారం సాయంత్రం చెరువులో నీట మునిగి మృతిచెందాడు. పులగుట్టపల్లికి చెందిన బండయ్యకు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు రాము ఉన్నారు. వ్యవసాయం చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకున్నారు. కుమారుడైన రాము నెలగొండ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం గ్రామంలోని చెరువులోకి ఈతకు వెళ్లిన రాము ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. రాము మృతితో పులగుట్టపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి.

నకిలీ నాణేల ముఠా అరెస్టు



నకిలీ నాణేల ముఠా సభ్యుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: నకిలీ బంగారు నాణేలను విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ముఠా సభ్యుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాడిపత్రి రూరల్ సీఐ చిన్నపెద్దయ్య, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. కూడేరు మండలం ఎంఎమ్ పల్లికి చెందిన గుజ్జల మురళీ, సాకే మల్లికార్జున సికింద్రాబాద్ చెందిన శివగాయత్రీ అలియాస్ దీపికతో ఫోన్ ద్వారా పరిచయం పెంచుకున్నారు. కొన్ని రోజుల తరువాత తమ పాత ఇళ్లు పడగొట్టే సమయంలో పాత బంగారు నాణేలు బయట పడ్డాయి వాటిని ఎలా విక్రయించుకోవాలో తెలిడం లేదని చెప్పారు. మీకు తక్కువ ధరకే ఇస్తామని నమ్మించారు. కాశేపల్లి టోల్‌గేట్ సమీపంలోని గేట్స్ కళాశాల వద్దకు డబ్బుతో రావాలని చెప్పడంతో వారు అక్కడికి వచ్చారు. డీల్ కుదుర్చుకున్న దొంగలు ఆమెకు 200 నకిలీ బంగారు నాణేలు ఇచ్చారు. డబ్బు ఇవ్వాలని కత్తితో బెదిరించి డబ్బుతో అక్కడి నుంచి పరారయ్యారు. బాధితులు పెద్దవడుగూరు పోలీసులకు గత నెల 25న ఫిర్యాదు చేయగా రంగంలోకి దిగిన పోలీసులు దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచారు. శుక్రవారం మిడుతూరు బస్టాండ్ వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారణ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు లో మరో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు.

సింహ వాహనంపై రంగనాథుడు



సింహవాహనంపై ఆలూరు కోన రంగనాథస్వామి

తాడిపత్రి: ఆలూరు కోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి స్వామివారు భక్తులకు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభంకాగా రాత్రి స్వామి వారికి విష్వక్సేరాధన, వాసుదేవ పుణ్యాహవాచనము, అంకురార్పణ, ధ్వజారోహణము, కలశ స్థాపన, దీక్షా హోమం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. రెండో రోజైన శుక్రవారం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలూరు గ్రామంలో నిర్వహించిన గ్రామోత్సవంలో ఆలూరు కోన రంగనాథస్వామి భక్తులకు సింహవాహనంపై దర్శనమిచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి వి.సుబ్రమణ్యం, ఆలయ చైర్మన్ రామచంద్రారెడ్డి, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఏఎన్‌ఎంల మధ్య కౌన్సెలింగ్ రగడ

- కాంట్రాక్టు ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్‌ను అడ్డుకున్న రెగ్యులర్ ఉద్యోగులు
- పోటాపోటీగా ఇరువర్గాల నిరసన
- ఉన్నతాధికారుల ఆదేశాలతో కాంట్రాక్టు ఉద్యోగులకు కౌన్సెలింగ్



డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: కాంట్రాక్టు, రెగ్యులర్ ఏఎన్‌ఎంల మధ్య 'కౌన్సెలింగ్ ' వ్యవహారం అగ్గిరాజేసింది. కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌ను రెగ్యులర్ ఉద్యోగులు అడ్డుకోవడంతో వారు నిరసనకు దిగారు. పోటీగా రెగ్యులర్ ఉద్యోగులు సైతం ఆందోళనకు దిగారు.

కౌన్సెలింగ్‌కు పిలిచిన అధికారులు : ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ 17 ఏళ్ల నుంచి ఒకే క్యాడర్‌లో విధులు నిర్వహిస్తూ కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలకు అర్బన్ కేంద్రాలకు కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే శుక్రవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఈ నేపథ్యంలోనే రెగ్యులర్ ఏఎన్‌ఎంలు ప్రధాన ద్వారం దగ్గర గేట్లు మూసి వేసి కాంట్రాక్టు ఉద్యోగులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు.

పోటా పోటీగా నిరసన : రెగ్యులర్ ఏఎన్‌ఎంలు వేలకు వేలు జీతాలు తీసుకుంటూ తమకు జరగాల్సిన కౌన్సెలింగ్‌ను అడ్డుకోవడం దారుణమని కాంట్రాక్టు ఉద్యోగులు వాపోయారు. తమకు న్యాయం చేసేంతవరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని నిరసనకు దిగారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం తమకు అవకాశం కల్పించిందని, అయితే రెగ్యులర్ ఏఎన్‌ఎంలు తమకు జరగాల్సిన కౌన్సెలింగ్‌ను అడ్డుకోవడం దారుణమన్నారు. మరోవైపు రెగ్యులర్ ఏఎన్‌ఎంలు సైతం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. జీరో సర్వీస్ కింద అందరికీ సమానంగా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఉద్యోగ సంఘాలతో భేటీ : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వీరబ్బాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి యుగంధర్‌తో జిల్లా ఎన్‌జీఓ సంఘం నాయకులు, ఏఎన్‌ఎం సంఘం నాయకులు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. విషయాన్ని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ దృష్టికి తీసుకెళ్తామని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ : ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో కాంట్రాక్టు ఏఎన్‌ఎంలకు శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 50 మంది ఏఎన్‌ఎంలు ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

4న జరగాల్సిన పీజీ పరీక్ష 19కి వాయిదా

అనంతపురం: గ్రూప్–4 మెయిన్ పరీక్ష ఉన్నందున శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నాలుగో తేదీన జరగాల్సిన పీజీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షను 19వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విశ్వనాథరెడ్డి



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డిని అభినందిస్తున్న న్యాయవాదులు

అనంతపురం: జిల్లా కోర్టులో శుక్రవారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ రేపాయి. నువ్వా..నేనా అన్నట్లు సాగిన పోరులో నూతన అధ్యక్షుడిగా కే. విశ్వనాథరెడ్డి గెలుపొందారు. కే.విశ్వనాథరెడ్డికి 281 ఓట్లు రాగా, పద్మజ 254 ఓట్లు దక్కించుకున్నారు. 27 ఓట్ల మెజార్టీతో విశ్వనాథరెడ్డి గెలుపొందారు. జనరల్ సెక్రెటరీ బరిలో నిలిచిన వెంకట్రాముడికి 277 ఓట్లు, రాజేంద్రప్రసాద్ 244 ఓట్లు వచ్చాయి. 33 ఓట్లు మెజార్టీతో వెంకట్రాముడు గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసిన శ్రీనివాసరెడ్డికి 250 ఓట్లు, గంగాధర్‌కు 210 ఓట్లు వచ్చాయి. 40 ఓట్ల మెజార్టీతో శ్రీనివాసరెడ్డి నెగ్గారు. సెక్రెటరీగా సిద్ధార్థ, ట్రెజరర్ బి. లక్ష్మీనారాయణరెడ్డి విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బి. నారాయణరెడ్డి అభినందించారు.

నీటి కుంటలో పడి రైతు మృతి



లోకనాథరెడ్డి (ఫైల్)

పెద్దవడుగూరు: మండల పరిధిలోని పి.కొట్టాలపల్లికి చెందిన లోకనాథ్‌రెడ్డి (38) అనే రైతు ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... లోక్‌నాథ్‌రెడ్డి గురువారం సాయంత్రం పశువులను మేపేందుకు అడవికి వెళ్లాడు. పశువులకు నీళ్లు తాపడం కోసం కుంట వైపు వెళ్లగా ప్రమాదవశాత్తూ కుంటలో పడ్డాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. శుక్రవారం ఉదయం కుంటలో మృతదేహం తేలియాడుతుండగా పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని వెలికి తీయించిన పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి భార్య శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

'సీపీఐకి విశ్వసనీయత లేదు'

అనంతపురం క్రైం: సీపీఐకి విశ్వసనీయత లేదని, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో ఈ నెల 1న రౌండ్ టేబుల్ సమావేశానికి పూనుకోవడం సరికాదని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి ప్రతినిధి కేవీ రమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు, శ్రీ బాగ్ ఒప్పందం ప్రకారం రాజధానిని ఎక్కడ నిర్మించాలో టీడీపీ తెలియజేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచి రాయలసీమకు మరిన్ని నీరు తరలించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలతో హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచితే జిల్లా ఎడారిగా మారుతుందని ప్రకటనలు ఇప్పించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాయలసీమ ద్రోహులు, టీడీపీ నాయకులను సమావేశానికి పిలవడం సరికాదన్నారు. టీడీపీని పక్కనపెట్టి, మిగిలిన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుంటేనే మీరు చేసే పోరాటానికి విశ్వసనీయత ఉంటుందన్నారు. లేకుంటే కమ్యూనిస్టులు మరో చారిత్రక తప్పిదానికి పాల్పడినట్లేనని ఆయన అన్నారు.

ఏపీలో బీజేపీని బలోపేతం చేయాలి



పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరైన బీజేపీ నాయకులు

అనంతపురం: ఆంధ్రప్రదేశ్‌లోనూ భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. అనంతపురంలో నేషనల్ పార్క్ ఎదురుగా బీజేపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆన్‌లైన్ ద్వారా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 9 సంవత్సరాల పాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే రూ.8 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. ప్రాంతీయ, కుటుంబ పార్టీలు ప్రజల నమ్మకాన్ని కోల్పోతున్నాయని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ బలమైన శక్తిగా ఉండబోతోందన్నారు. అమరావతిలో జరిగిన నిరసన కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌పై జరిగిన దాడిని పురందేశ్వరి ఖండించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంకాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ దుద్దుకుంట వెంకటేశ్వరరెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కులూరు విశాలాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. ఒకరి మృతి



మహానంద (ఫైల్)

బెళుగుప్ప: మండల పరిధిలోని గుండ్లపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మహానంద (50) అనే వ్యక్తి మృతి చెందారు. ఎస్‌ఐ రామకృష్ణయ్య వివరాల మేరకు ... శెట్టూరు మండలం యాటకల్లుకు చెందిన మహానంద, వెంకటరమణ రాయదుర్గం సమీపంలోని బానేపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. అయితే గుండ్లపల్లి జాతీయ రహదారిపై నక్కలపల్లికి చెందిన గంగాధర్ ద్విచక్ర వాహనంలో అతి వేగంగా వచ్చి ముందువెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహానంద తీవ్రగాయాలయ్యాయి. గంగాధర్, వెంకటరమణలకు రక్తగాయాలయ్యాయి. హుటాహుటిన మహానందను 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య సరస్వతి, కుమారులు రాజశేఖర్, ప్రదీప్ ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నార్పల: మండల కేంద్రంలోని గూగూడు రోడ్డు కాలనీలో నివాసం ఉంటున్న సుబహాన్ (35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలమేరకు... సుబహాన్ గుజిరీ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారని, వ్యాపారంలో భాగంగా పలువురితో అప్పులు చేశారని తెలిపారు. వ్యాపారంలో లాభాలు రాకపోడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలీక నిత్యం ఆవేదన చెందేవారన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం తన గుజిరీ షాపులో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడి భార్య హసీనా ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

అనంతపురం అర్బన్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, శిశువులు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో మహిళ శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను కలెక్టర్ తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముందుగా ఆరోగ్య ఆంధ్రకు తమ వంతు తోడ్పాటు అందిస్తామంటూ కలెక్టర్, అధికారులు, అంగన్‌వాడీలు, మహిళలు ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీల్లో పోషకాహారం తీసుకునేవారితో పాటు, ఇంటికి తీసుకెళ్లే వారు కూడా సక్రమంగా తినేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆరేళ్ల వయసు పిల్లల ఎత్తు, బరువు పరిశీలించాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాలకు వచ్చే వైద్యుల చేత అక్కడి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. పోషకాహారం అందించి రక్తహీనత లేకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కోటారి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ సుజాత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో దోషికి జీవిత ఖైదు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్: రాయదుర్గం మండల పరిధిలోని మలకాపురం గ్రామంలో 2021లో జరిగిన ఓ హత్య కేసులో దోషికి జీవిత ఖైదు పడింది. శుక్రవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. రాయదుర్గం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాసులు మద్యానికి బానిసయ్యాడు. మద్యం ఇప్పించమని అదే గ్రామానికి చెందిన గొల్ల గోపాల్‌ను తరచూ అడిగేవాడు. ఈ క్రమంలోనే 2021 జూన్ 7న సాయంత్రం 5.30 గంటల సమయంలో గొల్ల గోపాల్ అదే కాలనీలోని గొల్ల ఈరన్న ఇంటి వద్ద ఉండగా గొల్ల శ్రీనివాసులు అక్కడికే వెళ్లి మద్యం ఇప్పించాలని అడుగుతున్నా ఎందుకు ఇప్పించడం లేదు అంటూ వాగ్వివాదానికి దిగాడు. గోపాల్... నీకు మద్యం ఇప్పించేది లేదంటూ తెగేసి చెప్పాడు. కోపంతో ఊగిపోయిన శ్రీనివాసులు నిన్ను చంపితే ఎవరు అడ్డుపడతాడని ఎదపై కాలితో తన్నాడు. గొల్ల గోపాల్ కిందపడ్డాడు. అక్కడున్నవారు విడిపించడానికి ప్రయత్నించినా గొల్ల శ్రీనివాసులు వినకుండా గోపాల్ చాతిపై విచక్షణారహితంగా కాలితో తొక్కాడు. ఆ దెబ్బలకు గోపాల్ మృతి చెందాడు. ఈ ఘటనపై హతుడు గోపాల్ భార్య గొల్ల రేణుకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఈరన్న ... శ్రీనివాసులుపై క్రైం నం 326/2022 యూ/ఎస్ 302 ఐపీసీ నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారించి హత్యకు కారణమైన శ్రీనివాసులుకు 7వ అదనపు జిల్లా కోర్టు జడ్జి తిరుమలరావు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈ కేసు సమగ్రంగా దర్యాప్తు చేసిన సీఐ ఈరన్న, ఏపీపీ నాగరాజు, కోర్టు కానిస్టేబుళ్లు బాబు, క్రిష్ణమోహన్‌లతో పాటు నిందితుడితో పాటు సాక్షులను కోరులో హాజరు పరచి తీర్పు వెలువడేందుకు కృషి చేసినందులకు తనను ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి అభినందించారని డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ యుగంధర్, అర్బన్ ఎస్‌ఐ సుమన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

3న పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ఈనెల 3న పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5,655 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. బ్యాంక్‌లు సెలవు కారణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 3న పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

అధ్యాపకులూ నిత్య విద్యార్థులే



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: అధ్యాపకలూ నిత్య విద్యార్థులేనని, ఎప్పటికప్పుడు నూతన అంశాలను అధ్యయనం చేయాలని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం కంప్యూటర్ సైన్స్ విభాగంలో నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన అంశాలను బోధించడానికి అధ్యాపకులకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సుజాత, ప్రొఫెసర్ చెన్నారెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఏపీ శివ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవానీ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

అనంతపురం క్రైం: జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఉప్పరపల్లి డీ లేఅవుట్‌లో నిర్మాణ పనులకు కమిషనర్ భూమి పూజ చేశారు. నిర్మాణాలు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. సొంతంగా నిర్మించుకునే అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు. నీటి సరఫరాపై ఆరా: నీటి సరఫరాపై కమిషనర్ ఆరా తీశారు. నగరంలోని రహమత్‌నగర్, హమాలీ కాలనీ, ఆదర్శనగర్, డ్రైవర్స్ కాలనీ, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. శ్రీనగర్ కాలనీలో కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈ రాంప్రసాద్‌రెడ్డి, ఏఈ శంకర్‌ను ఆయన ఆదేశించారు.

ఎలక్ట్రానిక్స్ రంగంలో విస్తృత అవకాశాలు



జాతీయ సదస్సు సందర్భంగా సావనీర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం: ఎలక్ట్రానిక్స్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి అన్నారు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలు, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, భారత రక్షణ రంగ సంస్థల్లో ఎలక్ట్రానిక్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారికి అవకాశాలు అపారంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, కన్వీనర్ డి. పురుషోత్తం రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. ఆంజనేయులు, రీసోర్స్ పర్సన్ అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ, మారెమ్మకు బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

రాప్తాడు: మండల కేంద్రంలో పెద్దమ్మ, మారెమ్మ దేవతకు జ్యోతులు, బోనాలు సమర్పించారు. ఏటా శ్రీరామనవమి తర్వాత జ్యోతులు, బోనాలు సమర్పించడం ఆనవాయితీ. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, ఆకుపూజ, అభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి చీరలను కానుకలుగా సమర్పించారు.

పుస్తకాల వితరణ అభినందనీయం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలకు పుస్తకాల వితరణ అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. మెడికల్ కళాశాలలో 20 ఏళ్ల పాటు ట్యూటర్‌గా పనిచేసి ఆకస్మికంగా మృతిచెందిన ఫార్మ కాలజీ ట్యూటర్ డాక్టర్ నాగరాజు జ్ఞాపకార్థం వైద్యవిద్య పుస్తకాలను ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్ హరిప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం





మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

- ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మహిళా ఆర్థిక సాధికారిత సాధిస్తే ఆ కుటుంబం , సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాప్తాడు సమీపంలోని జాకీ కంపెనీకి కేటాయించిన స్థలంలో వైఎస్సార్ ఆసరా సభ నిర్వహించారు. రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లోని 1,759 గ్రూపులకు చెందిన 17,719 మంది మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన ఆసరా నిధులు రూ.16.61 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి హాజరయ్యారు. ముందుగా సీఎం జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలు గర్వంగా బతుకుతున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఆనందం చూడాలని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. చంద్రబాబు నాయుడు ఏ రోజూ పేదల పక్షాన నిలబడిన పాపాన పోలేదన్నారు.

పచ్చ పత్రికల రాతలను నమ్మకండి:

ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో విషపు రాతలు రాస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మొద్దని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పచ్చ మీడియాలో పరిటాల సునీత అవాకులు, చవాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమన్నారు. మహిళలు, రైతులను సునీత మోసం చేశావని, పేరూరు డ్యాంకు నీళ్లు ఇస్తామని చెప్పి రూ.1100 కోట్లతో టెండర్లు పిలిచి దోపిడీకి పాల్పడ్డారన్నారు. ప్రస్తుతం రూపాయి కూడా ప్రభుత్వం నుంచి తీసుకోకుండా మూడేళ్లుగా పేరూరు డ్యాంకు నీరు అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లోపు 6 వేల మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తామన్నారు. నియోజకవర్గంలో 10 వేల మంది పాడిరైతుల కోసం డెయిరీ ఏర్పాటు చేశామన్నారు. జగన్‌మోహన్ రెడ్డికి పాలన చేతకాదని, డబ్బు దుబారా చేస్తున్నారని ఓ పెద్దమనిషి మాట్లాడుతున్నారన్నారు. అయ్యా.. చంద్రబాబు ఇది ప్రజల సొమ్ము కాబట్టే మా ముఖ్యమంత్రి వారికే పంచుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెలు, మేకల ఫెడరేషన్ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్‌రెడ్డి, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు చిట్రెడ్డి జయలక్ష్మి, గుజ్జల వరలక్ష్మి, పసుపుల హేమావతి, చంద్రకుమార్, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, మరూరు సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, మండల కన్వీనర్లు జూటూరు శేఖర్, బండి పవన్‌కుమార్, గోవింద్ రెడ్డి, యూత్ మండల కన్వీనర్లు చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



అనంతపురం సప్తగిరి సర్కిల్: నగర శివారులోని రాజీవ్‌కాలనీ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు దౌలా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగర మేయర్ వసీం, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్ హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాంజనేయులు, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ అల్లీపీరా, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణవేణి, రహీం, అబ్దుల్ పాల్గొన్నారు.

71 మందికి ఉద్యోగాలు



ఓటీపీఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్‌తో ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులు

అనంతపురం: ఓటీపీఆర్ఐ-జేఎన్‌టీయూ అనంతపురంలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 71 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైరెక్టర్ బి. దుర్గాప్రసాద్ తెలిపారు. ' ఇండియన్ హెల్త్‌కేర్ బీపీఓ ' చెన్నై కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మొత్తం 80 మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 71 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్ , క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కోఆర్డినేటర్స్ మహేష్, డాక్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం : డీఎంహెచ్‌ఓ

రాప్తాడు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డీఎంఅండ్‌హెచ్‌ఓ వీరబ్బాయి దొర సూచించారు. శుక్రవారం మండలంలోని రామినేపల్లిలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి ఓబులుతో కలిసి పరిశీలించారు. ముందుగా గ్రామంలో ఇంటింటా తిరిగి పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో వీధులను శుభ్రం చేయించారు. పంచాయతీ కార్మికులతో డ్రైయినేజీలు, ట్యాంకులను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ కలిపారు. రోడ్లపై చెత్తాచెదారం శుభ్రం చేశారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్రతను పూర్తిగా తొలగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. ఇంటి లోపల, ఇంటి బయట లార్వా కనిపించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్‌వైజర్ నూర్‌బాషా, శేఖర్, ఆరోగ్య సహాయకురాలు లీలావతి, ఆశా రామాంజనమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- రూ.600 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఏనారాయణపురం పంచాయతీ పరిధిలోని ప్రహ్లాద నగర్, బీజేపీ కొట్టాల, శ్రీశ్రీనగర్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధి స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

మీ హయాంలో అభివృద్ధి గుర్తుకు రాలేదా చంద్రబాబు?

టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల దయ ఉంటే పేదలకు సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడాపరిస్థితి లేదని ఎమ్మెల్యే అన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండానే అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పేద ప్రజల అభివృద్ధి సంక్షేమ కోసం ప్రభుత్వం పని చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు ఓర్చుకోలేకపోతున్నారని మండిపడ్డారు. టీడీపీ అధికారంలో ఉన్నన్నాళ్లూ ప్రజల సంక్షేమాన్ని, మరచి కేవలం దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఎన్నిలకు ఇంకా సమయం ఉన్నా ప్రజలను గందరగోళానికి గురి చేయడానికి ముందస్తు ఎన్నికలు వస్తాయని టీడీపీ నాయకులు ఎల్లో మీడియా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

రూ.600 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి :

వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత దాదాపు రూ. 600 కోట్లతో నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే అన్నారు. నగరానికి దీటుగా నాలుగు పంచాయతీల్లో రూ. 80 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఎంపీటీసీ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, మల్లెల వేణుగోపాల్, బి.మదన్‌మోహన్‌రెడ్డి, కృష్ణవేణి, హజీవలి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ పట్టాభిషేక వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని కల్యాణ దుర్గం రోడ్డులో శుక్రవారం వసంతోత్సవ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు కల్యాణోత్సవం, వసంతోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గీతామందిరంలోనూ సీతారాముల పట్టాభిషేక వేడుకలు జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వేడుకలు నిర్వహించారు. పరుచూరు రమేష్, వేణుగోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

సింహ వాహనంపై ఊరేగిన సీతారాములు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు నేత్రానందంగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి సీతారాములు సింహ వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. కళాకారుల భజనలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఆలయ ఈఓ సుధారాణి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తత అవసరం



డాక్టర్ భీమసేనాచారి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలో కోవిడ్ రోగుల సంఖ్య ప్రస్తుతం మూడుకు చేరింది. వారిలో ఒకరు పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఇద్దరు రోగులు చికిత్స పొందుతున్నారు. ప్రత్యేక కోవిడ్ వార్డును ఏర్పాటు చేసి వారిని నిత్య పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కోవిడ్ కేసులు పెరుగుతున్న విషయం వాస్తవమేనని సర్వజనాస్పత్రి జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ భీమసేనాచారి తెలిపారు. కానీ వాటి తీవ్రత, వ్యాప్తి అంతగా లేదనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుతానికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొద్ది పాటి అనారోగ్యం, గొంతునొప్పి లాంటివి వచ్చినా చాలా మంది ఆస్పత్రికి వస్తున్నారని, వారిలో కోవిడ్ లక్షణాలు కనిపించడం లేదన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఎస్ఎఫ్ఐ కమిటీలో ఉన్న ఐదుగురు విద్యార్థులను హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారని , వెంటనే ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓ పరమేష్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ సమస్యలకు నిలయంగా మారిందని ఆందోళన చేసిన విద్యార్థులపై చర్యలు తీసుకోవడం సబబు కాదన్నారు. వర్సిటీలో విద్యార్థి సంఘాలు మాట్లాడే స్వేచ్ఛను అధికారులు హరిస్తున్నారని అన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

అనంతపురం అగ్రికల్చర్: చేపల పెంపకంపై ఆధార పడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహకాలు అందిస్తామని డీడీ కే శాంతి తెలిపారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి కమిటీలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నామన్నారు. 14 ప్రాంతాల్లో మినీ కియోస్క్ ఫిష్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతపురం, గుంతకల్లులో పైలెట్ ప్రాజెక్ట్ కింద రూ.10 లక్షలతో ఫిష్ ఆంధ్రా బ్రాండింగ్ యూనిట్లు, 38 మినీ రిటైల్ అవుట్‌లెట్లు, పీఎంఎఫ్ఎంఈ కింద 35 శాతం రాయితీతో యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చివరి రోజు రూ.2.42 కోట్ల వసూలు

అనంతపురం క్రైం: ఇంటి, ఖాళీ జాగా పన్ను వడ్డీ మాఫీకి శుక్రవారం చివరి రోజు కావడంతో రూ. 2.42 కోట్ల పన్ను వసూలైంది. ప్రభుత్వం ఈ నెల 17న వడ్డీ మాఫీకి అవకాశం కల్పిస్తూ జీవో విడుదల చేసింది. అప్పటి నుంచి దాదాపు రూ.13.62 కోట్లు వసూలైందని, నగరపాలక సంస్థ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో మొదటి సారి వసూలైనట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం, నగరంలోని 17, 41, 54, 64 సచివాలయాల్లో 8 కౌంటర్లు ఏర్పాటు చేశారు.

సంక్షిప్త సమాచారం

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణకుమారి



ప్రొఫెసర్ కృష్ణకుమారికి నియామక పత్రం అందజేస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కృష్ణకుమారి, పాలిమర్ సైన్స్ విభాగాధిపతిగా డాక్టర్ కే. రామగోపాల్, రూసా కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ సి. నాగరాజును నియమించారు. ఈ మూడు పదవుల్లోనూ ఉన్న ప్రొఫెసర్ జీవన్‌కుమార్ శుక్రవారం పదవీ విరమణ చేయడంతో వాటిని భర్తీ చేశారు. ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్కంఠంగా రాతిదూలం లాగుడు పోటీలు

ఆత్మకూరు: వడ్డుపల్లిలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. శుక్రవారం రాతిదూలం లాగుడు పోటీలను సీఐ మోహన్ ప్రారంభించారు. మొత్తం ఆరుజతల వృషభాలు ఈ పోటీల్లో ఉత్కంఠంగా పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన వృషభాలకు రూ.40 వేలు, ద్వితీయ స్థానంలో లిచిన వృషభాలకు రూ.32 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వృషభాలకు రూ.20 వేలు , నాల్గో స్థానంలో నలిచిన వృషభాలకు రూ.10 వేలు అందించారు. సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో మార్కెట్ ఫీజు వసూలు

అనంతపురం అగ్రికల్చర్: 2022-23 ఆర్థిక సంవత్సరం శుక్రవారం ముగిసింది. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు రికార్డు స్థాయిలో ఫీజు వసూలు చేసినట్లు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ , సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వై.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది రూ.3.50 కోట్లు లక్ష్యం కాగా, మునుపెన్నడూ లేని విధంగా రూ.4.14 కోట్లు వసూలైనట్లు తెలిపారు.

మార్కెట్ యార్డ్ సెక్రటరీగా విజయలక్ష్మి :

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీగా విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఇక్కడ పనిచేస్తున్న వై. రామ్మోహన్ రెడ్డిని హిందూపురం మార్కెట్ యార్డ్ సెక్రటరీ (ఓడీ)గా బదిలీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుకొండలో పని చేస్తున్న విజయలక్ష్మిని ఇక్కడికి బదిలీ చేశారు. రామ్మోహన్ రెడ్డి శనివారం రిలీవ్ కానున్నట్లు మార్కెట్‌వర్గాలు తెలిపాయి.

అమినిటీ సెక్రటరీకి పరామర్శ

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని 46వ సచివాలయ అమినిటీ సెక్రటరీ మౌనికను నగర మేయర్ వసీం శుక్రవారం పరామర్శించారు. ఆమె ద్విచక్రవాహనం బోల్తాపడి గాయపడింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆర్థోవార్డులో చికిత్స పొందుతుండగా మేయర్ పరామర్శించారు. వైద్యులు గౌస్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. పైప్‌లైన్ పనులు పరిశీలన : ఆజాద్‌నగర్ పైప్‌లైన్ మరమ్మతు పనులను మేయర్ వసీం శుక్రవారం పరిశీలించారు. పనులను వేగవంతం చేసి, ఈ ప్రాంత వాసులకు నీటి సమస్య లేకుండా చూడాలని డీఈ నరసింహను మేయర్ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నడిమివంక వద్ద పైప్ లైన్ షిఫ్టింగు పనులతో రెండ్రోజుల పాటు నీటిసరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ట్యాంకర్లతో నీరు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, కమల్‌భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, మధు, కిశోర్, శర్మాస్‌వలి పాల్గొన్నారు.

భారత్‌లో 1.73 కోట్ల మంది సెల్‌ఫోన్లకు బానిసలు

అనంతపురం: భారతదేశంలో 1.73 కోట్ల మంది సెల్‌ఫోన్లకు బానిసలయ్యారని, మొబైల్ చూడనిదే నిమిషం కూడా ఉండరని మత్తు పదార్థాల నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అబ్దుల్ రషీద్ అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో డ్రగ్స్, మత్తు మందు , మద్యానికి దూరంగా ఉండాలనే ఉద్దేశంతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణిరాధ, ఎస్కేయూ ఫార్మసీ కళాశాల లెక్చరర్ డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

రాప్తాడు: వచ్చే నెల 3 నుంచి 18వతేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది ఆయా స్కూళ్ల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 360 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల కోసం 5 కేంద్రాలను అధికారులు ఎంపిక చేశారు. ఒక్కో కేంద్రంలో చీఫ్ డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు 50 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటారు. రాప్తాడు జెడ్పీహెచ్ఎస్‌లో 161 మంది, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 292 మంది, ఆర్డీటీ అంధుల పాఠశాల పరీక్ష కేంద్రంలో 185, విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 280, ఎల్ఆర్‌జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 250 మంది పరీక్ష రాయనున్నారు.

'చాకచక్యంగా స్థలం అమ్మేశాడు'

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక జేఎన్‌టీయూ కళాశాల ఎదురుగా ఉన్న ఐదు సెంట్ల స్థలాన్ని అమరావతి అనే మహిళకు అమ్మి సొమ్ము చేసుకున్న ఓ ఘనుడి బండారం ఆలస్యంగా బయటపడింది. బాధితురాలు అనంతపురం వన్‌టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ సీఐ రవిశంకర్‌రెడ్డి వివరాలు మీడియాకు వెల్లడించారు. అమరావతి అనే మహిళకు తాడిపత్రికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి అనే వ్యక్తి రియల్ వ్యాపారిని అని నమ్మబలికాడు. తనది కాని ఐదు సెంట్ల స్థలాన్ని సంబంధంలేని డాక్యుమెంట్లు చూపించి, విక్రయించాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న ఆ పాత మధురాలు

అనంతపురం కల్చరల్: స్థానిక ఘంటసాల భవన్‌లో శుక్రవారం సంగీతోత్సవం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన గాయకుడు చంద్రతేజ అనంత గాయనీ గాయకులతో కలిసి ఆ పాత మధురాలను ఆలపించారు. సీనియర్ గాయకుడు పాల సముద్రం నాగరాజు, ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్షుడు జీవీ రామయ్య నేతృత్వంలో శ్రీదేవి, విజయలక్ష్మి, ఉమ, జ్యోత్స్న ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి.